ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కుమరం భీం
జిల్లా వార్తలు

8

శుక్రవారం 2 ఆగస్టు 2024

'క్రీడల్లో రాణించి జిల్లాకు పేరు తేవాలి'

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 1: నెట్‌బాల్ క్రీడల్లో రాణించి జిల్లాకు మంచిపేరు తేవాలని నెట్‌బాల్ జిల్లా అధ్యక్షుడు అలీబిన్ అహ్మద్ అన్నారు. గురువారం నెట్‌బాల్ పోటీల్లో జాతీయస్థాయిలో రాణించి సిల్వర్‌మెడల్ సాధించిన క్రీడాకారులు కీర్తన, ప్రణీత్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెట్‌బాల్ పోటీల్లో రాష్ట్ర, జాతీయ, అంత ర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు పేరుతేవాలన్నారు. కార్యక్రమంలో నెట్‌బాల్ జిల్లా సెక్రెటరీ తిరుపతి, కోచ్‌లు హరీష్, ప్రభాకర్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా ఏజెన్సీ గ్రామాల రోడ్లు

- ఈ దారుల గుండా నడక నరకప్రాయం
- చినుకుపడితే గ్రామాలు బాహ్య ప్రపంచానికి దూరం
- అత్యవసర సేవలకూ అవస్థలు

ఆసిఫాబాద్, ఆగస్టు 1: రహదారులు అభివృద్ధికి కేంద్ర బిందువులు. అలాంటి కీలకమైన వ్యవస్థకు జిల్లాలో అతీగతి లేని పరిస్థితి. ఏజెన్సీ ప్రాంతమైన జిల్లాలో నేటికీ 449గిరిజన గ్రామాలు రోడ్డు సౌకర్యానికి నోచుకోవడం లేదు. ప్రతియేటా రోడ్ల నెట్‌వర్క్‌ను మెరుగుపరిచేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు చెబుతున్న ప్రభుత్వాలు గిరిజన ప్రాంతాలపై శీతకన్ను వేయడం ఇక్కడి ప్రజలకు శాపంగా పరిణమిస్తోంది. జిల్లాలో 15 మండలాల్లోనూ సగానికి సగం గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేని పరిస్థితి. ఇక వర్షాకాలం వచ్చిందంటే చాలు జిల్లాలోని ఏజెన్సీ గ్రామాల్లో దుర్భర పరిస్థితిలు నెలకొంటాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించడటంతో గిరిగ్రామాలు బాహ్యప్రపంచానికి దూరంగా రోజుల తర బడి ఉండాల్సిన పరిస్థితులు ఉంటాయి.

ఇక్కడ నడక నరకప్రాయమే..

జిల్లాలో ముఖ్యంగా సిర్పూర్ నియోజకవర్గ పరిధిలోని దహెగాం, పెంచికలపేట, కౌటాల మండలాల్లోని కొన్ని గ్రామాల్లో రోడ్ల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. అదేవిధంగా ఆసిఫాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఆసిఫాబాద్, కెరమెరి, జైనూర్, వాంకిడి, సిర్పూర్ (యు), లింగాపూర్, తిర్యాణి మండలాల్లోనూ ఇంచుమించు ఇదే పరిస్థితి. రోడ్ల నెట్‌వర్క్‌ను మెరుగుపరిచేందుకు ప్రజాప్రతినిధులు ప్రతిపాదనలు పంపిస్తున్నా ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడం వల్ల ఈ పరిస్థితి నెలకొంటున్నది.

ప్రధానంగా అధికార యంత్రాంగం కూడా జనాభా అధికంగా ఉన్న గ్రామాలకు ప్రాధాన్యత ఇస్తూ తక్కువ ప్రజలు ఉన్న గిరిజన గూడాలు, తండాలను విస్మరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు ఏజెన్సీ మండలాల్లో రోడ్ల నిర్మాణాలకు అటవీ అనుమతులు అడ్డంకిగా మారాయి. మెజార్టీ గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యంలేక పోవడం, అంతర్గతరోడ్ల వ్యవస్థ పూర్తిగా దెబ్బతిని ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక ఏజెన్సీ మండలాలైన జైనూర్, సిర్పూర్ (యు), లింగాపూర్ మండలాల్లోని గిరిజన గూడాలకు వర్షాకాలంలో రోడ్డు సౌకర్యం దెబ్బతిని బాహ్యప్రపంచంతో వారాల తరబడి సంబంధాలు తెగిపోతాయి



కెరమెరి మండలం అనార్‌పెల్లిలో వాగును గ్రామస్థుల సహాయంతో దాటుతున్న ఉపాధ్యాయులు

అత్యవసర సేవలకు అవస్థలు..

జిల్లాలో ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ఏజెన్సీలోని మారుమూల గ్రామాల్లో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. వాగులు ఉప్పొంగి ప్రవహించడం, రోడ్లు కోతకు గుర వడం, కల్వర్టులు కొట్టుకుపోవడంతో అత్యవసర సేవలకు కూడా అవస్థలు పడాల్సి వస్తోంది. వాగులు ఉప్పొంగడంతో కెరమెరి మండలంలోని అనార్‌పెల్లి వాగుపై వంతెన లేకపోవడంతో వాగుదాటుతూ ఉపాధ్యాయులు విధులకు హాజరు కావాల్సిన పరిస్థితులు ఉత్పన్న మయ్యాయి. జైనూరు మండలంలోని లొద్దిగూడ గ్రామానికి వాగు దాటి కాలినడకన చేరుకొని వైద్య ఆరోగ్య సిబ్బంది వైద్యం చేయాల్సి వచ్చింది. ఇక కొన్నిగ్రామాలకు వర్షాలతో పూర్తిగా రోడ్లు కోతకు గురికావడంతో 108 ఇతర అత్యవసర సేవలకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి. మారుమూల అటవీ గ్రామాలకు పెద్దదిక్కుగా ఉన్న మట్టిరోడ్లపై కూడా ప్రస్తుతం నడక సాధ్యం దుస్థితికి చేరు కున్నాయి. జిల్లాలోని ఏజెన్సీ మండలాలతోపాటు మిగతా మండలాల్లో దాదాపు ఇలాంటి దుస్థితే నెలకొంది.



సిర్పూర్(టి) మండలంలో కొట్టుకుపోయిన కొట్టుకుపోయిన కల్వర్టు, కొలాంగూడ రోడ్డు



ఆసిఫాబాద్ మండలంలో బురదమయంగామారిన సాలేగూడ రోడ్డు

బీఆర్ఎస్ నాయకుల నిరసన



కాగజ్‌నగర్‌లో ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కాగజ్‌నగర్, ఆగస్టు 1: అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వాఖ్యాలను నిరసిస్తూ కాగజ్‌నగర్‌లో బీఆర్ఎస్ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సిర్పూరు నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు మాట్లాడుతూ సీఎం హోదాలో ఉండి మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయటం దారుణమన్నారు. ఇప్పటికైనా సీఎం మహిళలపై చేసినవ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్రస్థాయిలోఆందోళనలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు దాసరి నరేందర్, నిత్యానంద్,శ్రీనివాస్‌పాల్గొన్నారు.

జైనూర్: జైనూరులో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇంతీయాజ్‌లాల అధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు గురువారం రోడ్డుపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. సీఎం వెంటనే క్షమాపణ చెప్పనియెడల రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ కనకయాదవ్‌రావ్, మాజీమండల ఉపాధ్యక్షులు చిర్లేలక్ష్మణ్‌పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కాంట్రాక్టుకార్మికుల సమ్మె



సమ్మె చేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు

కాగజ్‌నగర్, ఆగస్టు 1: కాగజ్‌నగర్ మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కొన్ని రోజులుగా చేస్తున్న సమ్మె గురువారం కూడా కొనసాగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు శంకర్, సంజీవ్ మాట్లాడుతూ తమజీతాల్లోంచి కోతవిధించిన పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు రూ.3కోట్లకుపైగా బకాయిలు పేరుకుపోయినట్టు తెలిపారు. తమ సమస్యను వెంటనే పరిష్కరించేట్టు చూడాలన్నారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని తెలిపారు.

వంద రోజుల పాలనలో ఎలాంటి అభివృద్ధి లేదు



మాట్లాడుతున్న లెండుగురే శ్యాంరావు

కాగజ్‌నగర్, ఆగస్టు 1: ఎమ్మెల్యే హరీష్ బాబు వందరోజుల పాలనలో సిర్పూరు నియోజకవర్గంలో అభివృద్ధి ఏమీ జరగలేదని సిర్పూరు బీఆర్ఎస్ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు తెలిపారు. గురువారం స్థానికంగా ఆయన మాట్లాడారు. సిర్పూరు(టి)-కాగజ్‌నగర్ రోడ్డు అధ్వానంగా ఉందన్నారు. కనీసం ద్విచక్ర వాహనాల మీద కూడా పోలేని పరిస్థితి దాపురించిందన్నారు. వంద రోజుల్లో వంద కోట్ల నిధులు తెచ్చినట్టు గొప్పలు చెప్పుకోవటం సిగ్గుచేటన్నారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. అలాగే అసెంబ్లీలో మూడురోజుల క్రితం ఎమ్మెల్యే హరీష్‌బాబు సిర్పూరుప్రాంతాన్ని మహారాష్ట్ర లో కలపాలని కోరటం సిగ్గుచేటన్నారు. ఈ విషయాన్ని వెంటనే వెనక్కితీసుకోవాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో నాయకులు అంబాల ఓదెలు, ఆవుల రాజ్‌కుమార్, సలీం, నక్క మనోహర్, వరలక్ష్మి, లక్ష్మి, రమాదేవి పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లక్ష్మినర్సింహం

కాగజ్‌నగర్ టౌన్, ఆగస్టు 1: యువత స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కాగజ్‌నగర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మినర్సింహం అన్నారు. కళాశాలలో నెల రోజులుగా నిర్వహిస్తున్న ఉచితబ్యూటీషియన్ శిక్షణసర్టిఫికేట్‌కోర్సులో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు గురువారం భారతీయయువశక్తిట్రస్ట్ ప్రతినిధులతో కలిసి బ్యాంకురుణాలపై అవగాహన కల్పించారు. శిక్షణ పూర్తిచేసిన తరువాత నేర్చుకున్న పరిజ్ఞానాన్నిస్వయంఉపాధి పొందడానికి ఉపయోగించుకోవాలన్నారు. సిర్పూర్‌పేపర్ మిల్లు సహకారంతో భారతీయ యువశక్తి ట్రస్ట్ విద్యార్థులకు కావాల్సిన పాత్రను పోషిస్తుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి: సీఐ



మొక్కలు నాటుతున్న సీఐ, ఎస్సై

వాంకిడి, ఆగస్టు 1:నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించుకోవాలని సీఐశ్రీనివాస్ పేర్కొన్నారు. వన మహోత్సవంలో భాగంగా గురువారం పోలీస్‌స్టేషన్‌లో పోలీసు సిబ్బందితో కలిసి ఆయన మొక్కలునాటారు. ఈ సందర్భంగా ప్రతిఒక్కరూ తమవంతుగా రెండుమొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై సాగర్ పాల్గొన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ దోత్రె

ఆసిఫాబాద్, ఆగస్టు 1: ప్రభుత్వం ఈనెల5 నుంచి ఐదురోజులపాటు నిర్వహించతలపెట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని సమర్థ వంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి ఉన్నతాధికారులతో కలిసి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అన్నిజిల్లాల కలెక్టర్లు, అదనపుకలెక్టర్లు, అటవీశాఖఅధికారులు, జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వంచేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈనెల5న గ్రామాల్లో మున్సిపల్‌వార్డుల్లో కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు. 6న తాగునీటిసరఫరా, ఇంకుడు గుంతల నిర్మాణం, 7నమురుగుకాలువలు నీటినిలువ ప్రాంతాలను శుభ్రంచేసి గుంతలనుపూడ్చడం, 8నసీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహన, వీధికుక్కల దాడుల నివారణచేపట్టడం, 9నడ్రైడే, ప్రభుత్వ కార్యాలయాల శుభ్రం చేయడంవంటి కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఇందుకోసం ప్రత్యేకబృందాలను నియమించి క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు అమలు జరిగేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. వనమహోత్సవంలో భాగంగా నిర్ధేశించిన కార్యక్రమాలను పూర్తిచేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వెంకటేష్‌దోత్రే, అదనపుకలెక్టర్ దీపక్ తివారి, జిల్లాఅటవీశాఖఅధికారి నీరజ్‌కుమార్, డీఆర్డీవో సురేందర్, డీపీవో భిక్షపతి, డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్, మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, ఏపీడీ రామకృష్ణ పాల్గొన్నారు.

మొక్కలు సంరక్షణకు ప్రత్యేక చర్యలు: అదనపు కలెక్టర్



మొక్కలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్ రూరల్, ఆగస్టు 1: ప్రభుత్వం చేపట్టిన సంపద వనాల ద్వారా మొక్కలసంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడతామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారం ఆసిఫాబాద్ మండలంలోని పహాడిబండ గ్రామపంచాయతీలోగల వట్టివాగు వద్ద సంపద వనాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంపదవనాలలో మొక్కల సంరక్షణకు ప్రత్యేకచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు పహాడిబండ గ్రామంలో ఏర్పాటు చేసిన సంపద వనాలను పరిశీలించేందుకు వెళ్తున్న అదనపుకలెక్టర్ దీపక్‌తివారి రోడ్డు బురదమయంగా ఉండడంతో ట్రాక్టర్‌పై వెళ్లి మొక్కలను పరిశీలించారు. అనంతరం జిల్లాకేంద్రంలోని గ్రంథాలయాన్ని సందర్శించి గ్రంథాలయ ప్రహారి పనులను పరిశీలించారు. పాఠకులకు, విద్యార్థులకు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమైన మెటీరియల్‌ను అదుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని గ్రంథాలయ అధికారులకు సూచించారు. ప్రహరీపనులను త్వరగా పూర్తిచేసేలా చూడాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, డీటీ, టీజీడబ్ల్యూ, ఐడీసీ జెఈ శశిధర్, తదితరులు ఉన్నారు.

ఎందరో త్యాగధనుల పోరాట ఫలితమే సుప్రీం కోర్టు తీర్పు



ఆసిఫాబాద్‌లో స్వీట్లు తినిపించుకుంటున్న టీఎమ్మార్పీఎస్ నాయకులు

ఆసిఫాబాద్, ఆగస్టు 1: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ న్యాయమైనదని సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడంపై గురువారం టీఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని బాబుజగ్జీవన్‌రాం భవన్‌లో కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రవి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం చారిత్రాత్మక విజయమన్నారు. ఎందరో త్యాగధనుల పోరాట ఫలితమే సుప్రీం కోర్టు తీర్పు అన్నారు. కార్యక్రమంలో నాయకులు రవి, నరేష్, సంతోస్, జాను, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం, సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం..

చింతలమానేపల్లి/సిర్పూర్(టి)/కెరమెరి: ఎస్సీల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునేపథ్యంలో మండలకేంద్రాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రధాని నరేంద్రమోదీ, సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ రాష్ట్రఅధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు గురువారం క్షీరాభిషేకం నిర్వహించారు. చింతలమానేపల్లిలో జరిగిన కార్యక్రమంలో నాయకులు పోచయ్య, రామయ్య, నారాయణ, శ్రీనివాస్, శంకర్, జి శంకర్, సిర్పూర్(టి)లో నాయకులు చంద్రగిరి రవీందర్, కెరమెరిలో నాయకులు వినేష్, రాజయ్య, నరేష్, సంతోష్ ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.



చింతలమానేపల్లి, సిర్పూర్(టి)లో పీఎం, సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ప్రియుడితో కలిసి భర్తపై హత్యాయత్నం

- ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి
- నిందితుల అరెస్ట్

దహెగాం, ఆగస్టు 1: ప్రియుడితో కలిసి కట్టుకున్న భర్త హత్యకు కుట్రపన్ని చివరికి అతడి మృతికి కారణమైంది ఓ భార్య. ఇందుకు సంబంధించిన వివరాలను దహెగాం పోలీస్‌స్టేషన్‌లో గురువారం సీఐ అల్లం రాంబాబు వెల్లడించారు. అయనకథనం ప్రకారం.. దహెగాం మండలకేంద్రానికి చెందన బండ మల్లేష్(33)కు ఎల్లూరు గ్రామానికి చెందిన చెన్నవేణి మంజుల అలియాస్ సుజాతతో 13సంవత్సరాల క్రితం వివాహం అయింది. కాగా మంజులకు ఆరు సంవత్సరాల క్రితం దహెగాం గ్రామానికి చెందిన గుర్ల రాజు(23)తో వివాహేతర సంబంధం ఏర్పడింది. సంవత్సరం క్రితం మల్లేష్‌కు ఈ విషయం తెలియడంతో గొడవపడి కొంతకాలం వేర్వేరుగా ఉన్నారు. నాలుగునెలల క్రితం తల్లిదండ్రులు, పెద్దలు మల్లేష్, మంజులను ఒక్కటి చేశారు. అయినా మంజులలో మార్పురాకపోవడంతో తరుచూ గొడవలు జరిగేవి. జూలై25న మంజుల గుర్ల రాజు ప్రోత్సాహంతో మల్లేష్ గొంతును పిసికింది. మల్లేష్ అరుపులు విన్న అతని అన్నయ్య, సోదరి వెంటనే మల్లేష్‌ను వెంటనే కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అక్క డ వైద్యంఅందించి ఇంటికి తీసుకువచ్చారు. జూలై28న మల్లేష్ ఆరోగ్యపరిస్థితి విషమించడంతో మంచిర్యాల ఆసుపత్రికితరలిస్తుండగా మార్గమధ్యలోనే మల్లేష్‌మృతి చెందాడు. దీంతో సోదరుడు సత్తయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుజాత, ప్రియుడు రాజుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

జిల్లాలో 61 మంది బాల కార్మికుల గుర్తింపు: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాస్

ఆసిఫాబాద్, ఆగస్టు 1: జిల్లాలో 61 మంది బాలకార్మికులను గుర్తించామని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్ అన్నారు. ఆపరేషన్ ముస్కాన్-10 ముగింపు కార్యక్రమంలో భాగంగా జిల్లాకేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆపరేషన్ ముస్కాన్ టీం సభ్యుల పనితీరును అభినందించారు. జూలైలోనిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్-10 కార్యక్రమంలో జిల్లాలో 61మంది బాలకార్మికులను రెస్క్యూచేయడం జరిగిందన్నారు. ఇందులో ఆసిఫాబాద్ డివిజన్‌లో 36మంది, కాగజ్‌నగర్ డివిజన్‌లో 25మంది పిల్లలను రిస్క్ చేసినట్లు తెలిపారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కృషిచేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలోఏఎస్పీ ప్రభాకర్‌రావు, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ అధికారి మహేష్, ఎస్‌బీ సీఐ రాణాప్రతాప్, డీసీఆర్బీ సీఐ రమేష్, అడ్మిన్ ఆర్ఐ పెద్దయ్య, ఆపరేషన్ ముస్కాన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కోనేరు కృష్ణారావు జన్మదిన వేడుకలు

- రక్తదాన శిబిరం నిర్వహించిన అభిమానులు, కార్యకర్తలు

కాగజ్‌నగర్, ఆగస్టు 1: పట్టణంలో గురువారం కాంగ్రెస్ నాయకుడు, మాజీ జడ్పీ ఇన్‌చార్జి చైర్మన్ కోనేరు కృష్ణారావు జన్మదిన వేడుకలు కాగజ్‌నగర్‌లో ఘనంగా జరిగాయి. వినయ్‌గార్డెన్‌లో కార్యకర్తలు, అభిమానులు రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం అభిమానుల మధ్య ఆయన కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా కోనేరు కృష్ణారావు మాట్లాడుతూ తన పుట్టిన రోజు సందర్భంగా రక్తదానం చేసిన అభిమానులు, కార్యకర్తలందరికీ రుణ పడి ఉంటానన్నారు. అలాగే వేడుకల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కౌన్సిలర్లు, సిర్పూరు నియోజకవర్గం నుంచివచ్చిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కోనేరు కృష్ణారావును సన్మానిస్తున్న నాయకులు



'సమస్యలు పరిష్కరించడంలో యాజమాన్యం విఫలం'

జైపూర్, ఆగస్టు 1: సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టుకార్మికుల సమస్యలు పరిష్కరించడంలో యాజమాన్యం విఫలమైందని హెచ్‌ఎంఎస్ రాష్ట్రఅధ్యక్షుడు రియాజ్‌అహ్మద్ పేర్కొన్నారు. గురువారం ఎస్టీపీపీ ప్రధానగేటు ఎదుట కాంట్రాక్టు కార్మికులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిప్యూటి చీఫ్ లేబర్ కమీషనర్ సింగరేణి డైరెక్టర్‌తో సమావేశం ఏర్పాటుచేయాలని ఆదేశాలు జారీచేసినప్పటికీ ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదన్నారు. కార్మికుల వెల్ఫేర్ చూడాల్సిన యాజమాన్యంపట్టించుకున్న పాపాన పోలేదన్నారు. తక్షణమే సింగరేణి డైరెక్టర్ ఆయా సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. డిమాండ్‌లు నెరవేర్చకపోతే అందర్ని కలుపుకుని ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ నాయకులు జక్కుల నారాయణ, ఆర్ విక్రమ్‌కుమార్, ప్రదీప్‌రెడ్డి, సంపత్, సత్యనారాయణచారి, అజర్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియాలో 91శాతం బొగ్గు ఉత్పత్తి

రెబ్బెన, ఆగస్టు 1: బెల్లంపల్లి ఏరియాలో 91శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్టు జీఎం రవిప్రసాద్ తెలిపారు. గురువారం జీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఖైరిగూడ ఓపెన్‌కాస్టు ద్వారా జూలై నెలలో 2.20లక్షల టన్నుల బొగ్గును తీయాల్సి ఉండగా, 2.18లక్షల టన్నుల ఉత్పత్తి సాధించినట్టు తెలిపారు. ఈ వార్షిక సంవత్సరంలో ఇప్పటివరకు 12.10లక్షలటన్నుల ఉత్పత్తి సాధించాల్సి ఉండగా, 12.17 లక్షల టన్నుల బొగ్గుఉత్పత్తి చేశామన్నారు. సమావేశంలో డీజీఎంఎం ఉజ్వల్‌కుమార్, డీజీఎం పర్సనల్ తిరుపతి తదిరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను పెంచాలి: జీఎం

మందమర్రిటౌన్, ఆగస్టు 1: మందమర్రి ఏరియాకు నిర్ధేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించడంతోపాటు అదనపు ఉత్పత్తే ధ్యేయంగా కార్మికులు, అధికారులు పనిచేయాలని జీఎం మనోహర్ పేర్కొన్నారు. గురువారం జీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలతో కొంత బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగిందన్నారు. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టినందున ఉత్పత్తి సాధనను పెంచాలన్నారు. జూలైలో 2.50లక్షల టన్నుల లక్ష్యం కాగా, 1,87,217 టన్నులు సాధించామన్నారు. ఆర్కే ఓసీపీలో 138శాతం బొగ్గు ఉత్పత్తి సాధించడం అభినందనీయమన్నారు. కేకే ఓసీపీలో 48షిఫ్టులు వర్షాల వల్ల నష్టం వాటిల్లిందన్నారు. గడిచిన ఐదునెలల్లో 81శాతంఉత్పత్తి సాధించామన్నారు. అధికారులు, కార్మికులు ప్రమాదరహిత ఉత్పత్తే ధ్యేయంగా పనిచేయాలన్నారు. రక్షణతో కూడిన విధులు నిర్వహించాలన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

కాసిపేట: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని మందమర్రి జీఎం మనోహర్ అన్నారు. గురువారం కాసిపేట మండలంలోని గోండుగూడలో మొక్కలు నాటి నీరు పోశారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. అనంతరం కేకేఓసీపీ ప్రభావిత గ్రామాల్లోని యువకులకు వాలీబాల్ కిట్‌లను, పూలు, పండ్ల మొక్కలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏఐటీయూసీ మందమర్రిఏరియా బ్రాంచ్‌కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



కాసిపేట: గోండుగూడలో మొక్కలు నాటుతున్న జీఎం మనోహర్

'గనుల ప్రైవేటీకరణను విరమించుకోవాలి'

కాసిపేట, ఆగస్టు 1: సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని ఐఎన్‌టీయూసీ కేంద్రకమిటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య అన్నారు. గురువారం కాసిపేట 1వగనిలో నిర్వహించిన గేట్‌మీటింగ్‌కు ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణి గనులను ప్రైవేటుపరం చేసేందుకు కుట్రలు చేస్తోందన్నారు. లాభాల వాటాను 35 శాతం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమం కోసం, హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం ఐఎన్‌టీయూసీ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి మిట్ట సూర్యనారయణ, చంద్రశేఖర్, శ్రీనివాస్, శంకర్‌రావు, బన్న లక్ష్మణ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

'సింగరేణి ఆసుపత్రిపై నిర్లక్ష్యం వీడాలి'

బెల్లంపల్లి, ఆగస్టు 1: పట్టణంలోని సింగరేణిఏరియా ఆసుపత్రిపై యాజమాన్యం నిర్లక్ష్యం వీడాలని గురువారం ఆసుపత్రి ఎదుట ఆసుపత్రి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాజీఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, పరిరక్షణ కమిటీ నాయకులు సూరిబాబు, రాజమౌళి మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ఏరియాఆసుపత్రిపై చిన్నచూపు చూస్తోందన్నారు. ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులనునియమించి మెరుగైనవైద్య సేవలందించేందుకు యాజమాన్యం చొరవచూపాలని డిమాండ్ చేశారు. ఏరియా ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్యసేవలందించేందుకు చర్యలు చేపట్టకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మణిరాంసింగ్, చాంద్‌పాషా, గజెల్లి వెంకటయ్య, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆటో డ్రైవర్ల దినోత్సవం

ఏసీసీ, ఆగస్టు 1: ప్రపంచ ఆటో డ్రైవర్ల దినోత్సవ వేడుకలను గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మంచిర్యాల ఆటో యూనియన్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కాలేజీ రోడ్డు, తిలక్‌నగర్, మార్కెట్, రైల్వేస్టేషన్ ఆటో స్టాండ్ అడ్డాల వద్ద జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సీనియర్ డ్రైవర్లను శాలువాలతో సన్మానించి స్వీట్లు పంచి వేడుకలు నిర్వహించారు. ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం సంవత్సరానికి రూ. 24 వేలుచెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు బెల్లంకొండ మురళీ, లీగల్ అడ్వైజర్ కేవీ ప్రతాప్, వర్కింగ్ ప్రెసిడెంట్ పొట్ట మధుకర్,ఫౌండర్ రాజిరెడ్డి, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఉన్న ఆటో స్టాండ్ లో యూనియన్ జిల్లా అధ్యక్షుడు తూముల నరేష్ ఆధ్యక్షతన జెండా ఎగురవేశారు. కార్యక్రమానికి అతిథిలుగా హాజరైన మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేష్, ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ సీనియర్ ఆటో డ్రైవర్లను సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, ట్రాఫిక్ సీఐ సత్యనారాయణలు మాట్లాడుతూ ఆటో స్టాండ్ అడ్డాల వద్ద కట్టడాలను తొలగించి డ్రైవర్లకు ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో హమాలీ సంఘం అధ్యక్షుడు పూదరి తిరుపతి, ఆటో యూనియన్ నాయకులు , డ్రైవర్లు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కృష్ణాకాలనీ ఆటో యూనియన్ అధ్యక్షుడు రాగిడి రాజు అన్నారు. ప్రపంచ ఆటో కార్మికుల దినోత్స వాన్ని కృష్ణాకాలనీలోని ఆటో యూనియన్ కార్యాలయం వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ మాజీ అధ్యక్షుడు భద్రం తిరుపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ బోగే సమ్మయ్య, ఉపాధ్యక్షులు మామిడి సదానం దం, ఎనగందుల వెంకటేష్, కోశాధికారి బొబ్బల కుమార్, ప్రధాన కార్యదర్శి ఎండి రహీం. సభ్యులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద గురువారం ప్రపంచ ఆటో కార్మికుల దినోత్సవాన్ని బెల్లంపల్లి ఆటో డ్రైవర్స్ వర్కర్స్‌యూనియన్, మంచిర్యాల జిల్లా ఆటో యూనియన్‌ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిం చారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు కట్ట రామ్‌కుమార్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాల డిమాండ్ చేశారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

చెన్నూరు, ఆగస్టు 1: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని కిష్టంపేట, పొక్కూరు, కొమ్మెర గ్రామాల్లో గురువారం జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు పర్యటించారు. ఎస్‌బీఐ బ్యాంకును సందర్శించి రైతు రుణమాఫీ నిమిత్తం అందిస్తున్న సేవలను పరిశీలించారు.

భీమినిలో ప్రత్యేక అధికారి తనిఖీ

భీమిని, ఆగస్టు 1: రాంపూర్, బిట్టూర్‌పల్లి, ప్రాథమిక పాఠశాలలు, మండల కేంద్రంలోని పాఠమిక, ఉన్నత పాఠశాలలు అంగన్‌వాడీ కేంద్రాలను మండల ప్రత్యేక అధికారి జగన్మోహన్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. పెద్దపేట, లక్ష్మీపూర్ నర్సరీలను సందర్శించారు. భవిత కేంద్రం, తెలంగాణ గ్రామీణ బ్యాంకు, మండల సమాఖ్య కార్యాలయాలకు వెళ్లి సూచనలిచ్చారు. ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంపీడీవో గంగామోహన్, ఏపీవో భాస్కర్‌రావు, ఏపీఎం ప్రకాష్‌గౌడ్, పంచాయతి కార్యదర్శులు సత్యనారాయణ, ఊబేదు, అజయ్ ఉన్నారు.

ఆగస్టు, సెప్టెంబరులోనూ జోరు వానలు!

» భారత వాతావరణ శాఖ అంచనా

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల సీజన్‌లో తొలి అర్ధభాగం మంచి వర్షాలు కురిశాయి. అదేజోరు ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కొన సాగనుంది. రెండు నెలల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం (దీర్ఘకాలిక సగటులో 106 శాతం) నమోదవుతుంది. అయితే ఈశాన్య రాష్ట్రాలు, తూర్పు భారతంలో కొన్ని ప్రాంతాలు, సౌరాష్ట్ర, లద్దాక్, మధ్య, దక్షిణ భారతంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆగస్టు నెలలో ఈశాన్య రాష్ట్రాలు, వాయవ్య, మధ్య, తూర్పు, దక్షిణాదిలో పలు భాగాలు, కశ్మీర్, లద్దాక్ వంటి ప్రాంతాలు తప్ప దేశంలో మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది. ఈ మేరకు ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించి ముందస్తు అంచనా నివేదికను వాతావరణ శాఖ గురువారం విడుదల చేసింది.

ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో దేశంలో 422.8 మి.మీ వర్షపాతం (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 106 శాతం) నమోదవుతుందని తాజా బులెటిన్‌లో పేర్కొంది. ఆగస్టులో దేశంలో 254.9 మి.మీ. (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 94 నుంచి 106 శాతం వరకు) నమోదు కానుంది. ఆగస్టులో దక్షిణాది రాష్ట్రాల్లో తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని తెలిపింది. కాగా, ఆగస్టులో దక్షిణ కోస్తా, సీమల్లో ఎక్కువ, ఉత్తర కోస్తాలో తక్కువ వర్షాలు ఆగస్టు నెలలో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షాలు కురవనున్నాయి. ఉత్తర కోస్తాలోని ఎక్కువ ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయి. ఉత్తర తెలంగాణ, ఉత్తర కోస్తాలతోపాటు, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

ఇది జాతీయ విపత్తే

మా నాన్నను కోల్పోయినప్పటి పరిస్థితి గుర్తుకొచ్చింది: రాహుల్‌గాంధీ

» సోదరి ప్రియాంకతో కలిసి..
ముండక్కై, చురాల్‌మలలో పర్యటన
» జాతీయ విపత్తుగా ప్రకటించాలి: పినరయి
» 289కి పెరిగిన మరణాలు

వయనాడ్, ఆగస్టు 1: "వయనాడ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ఆ దృశ్యాలు హృదయాన్ని తీవ్రంగా గాయపరుస్తున్నాయి. నాకు ఏం చెప్పాలో తెలియడం లేదు. మా నాన్న చనిపోయినప్పుడు ఎలా ఉండేదో.. ఇప్పుడు అలాంటి బాధనే ఎదుర్కొంటున్నాను. నా దృష్టిలో ఇది జాతీయ విపత్తే" అని లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ఉద్వేగంతో అన్నారు. గురువారం ఆయన తన సోదరి ప్రియాంక గాంధీతో కలిసి వయనాడ్‌లో కొండచరియల బాధిత ప్రాంతాలు-- ముండక్కై, చురాల్‌మల, అట్టమల, మెప్పాడిలో పర్యటించారు. ఈ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాల్లో, ఆస్పత్రుల్లో బాధితులతో మాట్లాడారు. "దేశం మీ వెన్నంటే ఉంది.." అంటూ వారికి ధైర్యం చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇది బాధాకరమైన పరిస్థితి అని.. పినరయి ప్రభుత్వం బాధితులకు అన్ని విధాలా సాయం చేయడానికి కట్టుబడి ఉందని చెప్పారు. ముందే హెచ్చరించామంటూ లోక్‌సభలో హోంమంత్రి అమిత్‌షా చేసిన ప్రకటన గురించి విలేకరులు ప్రస్తావించగా.. "ఇది రాజకీయ ఘర్షణకు సమయం కాదు. అన్ని వ్యవస్థలు కలిసికట్టుగా పనిచేయాల్సిన తరుణమిది" అని వ్యాఖ్యానించారు. కరోనా కష్టకాలంలో తాను, ప్రియాంక వయనాడ్ ప్రజలకు అండగా ఉన్న విషయాన్ని గుర్తుచేస్తూ.. ఇప్పుడు కూడా సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అనంతరం ఇదే విషయాన్ని తన ఎక్స్, ఫేస్‌బుక్ ఖాతాల్లో పోస్ట్ చేశారు. మరోవైపు కేరళ సీఎం పినరయి విజయన్ కూడా వయనాడ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 280కి పైగా పౌరులు చనిపోయారని, కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జాతీయ విపత్తుగా ప్రకటించడానికి అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న సైన్యం, రెస్క్యూ వర్కర్లు, స్థానికులను ఆయన అభినందించారు. ఆర్మీ జాగిలాలు మృతదేహాలను గుర్తిస్తున్నాయని, నదిలో కొట్టుకుపోయిన శరీర భాగాలను వెలికితీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. కాగా.. కొండచరియలు విరిగిపడ్డ ఘటనల్లో మృతుల సంఖ్య 289కి పెరిగినట్లు అధికారులు వివరించారు. గల్లంతైన వారి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.


పునరావాస శిబిరంలో బాధితులను ఓదారుస్తున్న రాహుల్, ప్రియాంక

డార్క్ టూరిజం వద్దు

వయనాడ్‌లో డార్క్ టూరిజానికి రావొద్దంటూ కేరళ పోలీసులు సామాజిక మాధ్యమాల్లో విజ్ఞప్తి చేశారు. దీంతో.. 'డార్క్ టూరిజం' అనే పదం వైరల్‌గా మారింది. 'చెర్నోబిల్ అండ్ ది డార్క్ టూరిస్ట్' టీవీ షోతో ఈ పదం బాగా పాపులర్ అయింది. మరణం, విషాదం, హింస చోటుచేసుకుని, అసాధారణ పరిస్థితులు ఉండే ప్రదేశాలను సందర్శించడాన్ని డార్క్ టూరిజం అంటారు. ఉదాహరణకు ఉక్రెయిన్‌లోని చెర్నోబిల్ (అణు విద్యుత్తు కేంద్రం) ఘటన, కాంబోడియాలో కిల్లింగ్ ఫీల్డ్స్, పోలెండ్‌లోని అష్విట్జ్ క్యాంప్ వంటివి డార్క్ టూరిజం కిందకు వస్తాయి. ఇప్పుడు వయనాడ్‌కు డార్క్ టూరిస్టులు వస్తే.. సహాయక చర్యలకు ఆటంకాలేర్పడతాయని కేరళ పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు.

హమాస్‌కు భారీ దెబ్బ!

» ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మిలిటరీ చీఫ్ డెయిఫ్ హతం!
» జూలై 13న గాజాలో అంతం చేశాం
» ప్రకటించిన ఇజ్రాయెల్ సైన్యం
» ఆ ప్రకటనను ఖండించిన హమాస్

జెరూసలెం, ఆగస్టు 1: హమాస్‌కు మరో భారీ దెబ్బ తగిలింది. ఇరాన్ రక్షణలో ఉన్న హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్యకు గురైన మరునాడే హమాస్ మిలిటరీ చీఫ్, ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మహమ్మద్ డెయిఫ్ హతమయ్యాడు. డెయిఫ్‌ను తమ సైన్యం అంతం చేసినట్లు ఇజ్రాయెల్ గురువారం అధికారికంగా ప్రకటించింది. తన ప్రకటనలో ఆపరేషన్ వివరాలను వెల్లడించింది. "మా సైన్యం (ఐడీఎఫ్) గత నెల 13న గాజాలోని ఖాన్ యూనిస్ ప్రాంతంపై జెట్లతో దాడి చేసింది. అక్కడ హమాస్‌కు చెందిన డిప్యూటీ కమాండరు నివాసంలో డెయిఫ్ ఉన్నట్లు గుర్తించాం. అక్కడ జెట్లతో బాంబులు ప్రయోగించాం. ఈ దాడిలో డెయిఫ్ హతమయ్యాడు" అని ఆ ప్రకటనలో తెలిపింది. గత ఏడాది అక్టోబరు ఏడున ఇజ్రాయెల్ భూభాగంపై జరిగిన దాడుల ఆలోచన, ప్రణాళిక, అమలు అంతా డెయిఫ్ నేతృత్వంలో జరిగిందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఈ దాడుల్లో 1197 మంది ఇజ్రాయెల్ పౌరులు చనిపోయారు. కాగా, డెయిఫ్ మరణవార్తపై హమాస్ స్పందించింది. ఖాన్ యూనిస్‌పై జూలైలో ఇజ్రాయెల్ దాడులు చేసిన మాట నిజమేనని, అందులో 90మంది చనిపోయారని, మృతుల్లో డెయిఫ్ లేరని గాజాలోని హమాస్‌కు చెందిన ఆరోగ్య వర్గాలు ధ్రువీకరించాయి.

కర్ణాటక సీఎంకు గవర్నర్ నోటీసుపై మంత్రివర్గం అభ్యంతరం

» వెనక్కి తీసుకోవాలని ఏకగ్రీవ తీర్మానం

బెంగళూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార(ముడా) ఇంటి స్థలాల కేటాయింపు అవినీతి వ్యవహారంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ నోటీసులు జారీ చేయడంపై మంత్రి వర్గం తీవ్ర అభ్యంతరం తెలిపింది. విధానసౌధలో గురువారం సీఎం సిద్దరామయ్య లేకుండా డీసీఎం డీకే శివకుమార్ అధ్యక్షతన క్యాబినెట్ భేటీ జరిగింది. ముడా అవినీతికి సంబంధించి గవర్నర్ జారీ చేసిన నోటీసులు వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ విషయాన్ని సహకార శాఖ మంత్రి రాజణ్ణ మీడియాకు తెలిపారు. సీఎం సిద్దరామయ్యకు రాజభవన్ నుంచి వచ్చి న షోకాజ్ నోటీసు గురించి చర్చించామని, న్యాయపోరాటం చేయాలని తీర్మానించామని చెప్పారు. గవర్నర్ జారీ చేసిన నోటీసును వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో తీర్మానించామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి గవర్నర్ నోటీసు జారీ చేయడం రాజకీయ ప్రేరేపితమని ఆరోపించారు. నోటీసులు తిరస్కరించాలని నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు.

ఉత్తరాది అతలాకుతలం

(మొదటి పేజీ తరువాయి)

కోల్పోయారు. కులు జిల్లాలో ఏడుగురు కొట్టుకుపోయారు. మలానా జల విద్యుత్ కేంద్రంలో పలువురు చిక్కుకుపోయారు. బియాస్ నది ఉధృతి, కొండచరియలు విరిగిపడడంతో కీలకమైన మనాలీ-చండీగఢ్ జాతీయ రహదారి పలుచోట్ల తీవ్రంగా దెబ్బతిన్నది. హిమాచల్ సీఎం సుఖుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఫోన్ చేసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాగా, రాష్ట్రంలోని పాలంపూర్, చౌరీలో 21 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ధర్మశాల (18 సెం.మీ.) సహా పలు ప్రాంతాల్లో 10కి పైగా సెం.మీ. వర్షం పడింది. కంగ్రా, కులు, మండిలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలతో రాత్రికి రాత్రే వరద పోటెత్తింది. పలు నదులు ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. డెహ్రాడూన్‌లో పరిస్థితి తీవ్రంగా ఉంది. రాష్ట్రంలో మొత్తం 12 మంది మృతిచెందారు. హరిద్వార్‌లోనే ఆరుగురు చనిపోయారు. ఇక్కడ 21 సెం.మీ. వర్షపాతం నమోదైంది. చాలాచోట్ల 10 సెం.మీ. పైన వాన పడింది. కేదార్‌నాథ్ మార్గంలో 1,500 మంది యాత్రికులు చిక్కుకుపోయారు. వీరిలో 425 మందిని హెలికాప్టర్ ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఉత్తరాఖండ్, హిమాచల్‌లో ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్, సైన్యం, స్థానిక పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. దేశ రాజధాని ఢిల్లీలోని చాలా ప్రాంతాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. ఆరుచోట్ల ఒక్క రోజులోనే 10 సెం.మీ.పైగా వర్షపాతం నమోదైంది. వివిధ ఘటనల్లో ఐదుగురు చనిపోయినట్లు అధికారులు తెలిపారు. 12 ఏళ్ల బాలుడు, 26 ఏళ్ల యువకుడు విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు రాజస్థాన్ రాజధాని జైపూర్‌ను వర్షాలు ముంచెత్తాయి. ఓ ఇంట్లోకి వరద చేరడంతో ఆరేళ్ల బాలిక సహా ముగ్గురు మృతిచెందారు. హిమాచల్, పంజాబ్, హరియాణా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గోవాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.


వర్షాలకు హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీలో ధ్వంసమైన రోడ్డు



పార్లమెంట్ పైకప్పు లీకేజీ

» బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాల మండిపాటు
» లీకేజీ స్వల్పమే.. పరిష్కరించాం: కేంద్రం

న్యూఢిల్లీ, ఆగస్టు 1: ఢిల్లీలో కురుస్తున్న భారీ వర్షాలకు కొత్త పార్లమెంటు భవనం పైకప్పు లీకవుతోంది. రూ.1,000 కోట్లకు పైగా ఖర్చు చేసి నిర్మించిన ఈ భవనం లాబీలోని గాజు పైకప్పు నుంచి కింద ఉంచిన బకెట్‌లోకి నీరు ధారగా పడుతున్న వీడియోను సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. "కొత్త భవనం కంటే పాత భవనం చాలా మెరుగ్గా ఉంది. వర్షాకాల సమావేశాలను పాతదానిలో ఎందుకు నిర్వహించకూడదు. కనీసం కొత్తదానిలో నీరు కారడం ఆగిపోయే వరకైనా..' అంటూ వ్యంగాస్త్రాలు సంధించారు. ఈ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రతి కొత్త భవనం పైకప్పు నుంచి నీరు లీకవడం.. బాగా ఆలోచించి రూపొందించిన డిజైన్‌లో భాగమా అని ప్రజలు అడుగుతున్నారని ఆయన బీజేపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ వీడియోపై కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ స్పందించారు. "బయట పేపర్ లీక్.. లోపల వాటర్ లీక్.. నిర్మించిన ఏడాది పూర్తి కాకుండానే పార్లమెంట్ లాబీలో నీరు లీక్ కావడం కొత్త భవనంలో అత్యవసర పునరుద్ధరణ సమస్యలను ఎత్తి చూపుతోంది" అని ఎద్దేవా చేశారు. ఈ అంశంపై చర్చించడానికి ప్రస్తుత లోక్‌సభ సమావేశాల్లో ఆయన వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. 'రూ.1,200 కోట్ల వ్యయంతో నిర్మించిన పార్లమెంట్ ఇప్పుడు రూ.120 బకెట్‌పై ఆధారపడి ఉంది' అని ఆమ్ ఆద్మీ పార్టీ ఎద్దేవా చేసింది. సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా కొత్త పార్లమెంట్ భవనాన్ని 2023 మే 28న ప్రధాని మోదీ ప్రారంభించారు. కాగా, పైకప్పు గ్లాస్ డోమ్‌లకు ఏర్పాటుచేసిన పట్టీలు వదులుగా ఉండటంతో కొత్త పార్లమెంటు భవనం మకర ద్వారం వద్ద స్వల్పంగా నీరు లీకైందని లోక్‌సభ సెక్రటేరియట్ తెలిపింది. సకాలంలో సమస్యను గుర్తించి, వెంటనే మరమ్మతులు చేపట్టామని, అంతటితో నీరు కారడం ఆగిపోయిందని కేందర ప్రభుత్వం వివరణ ఇచ్చింది.



'ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి'

జైనూర్, ఆగస్టు 1: మండలకేంద్రంలో ఈనెల9 నిర్వహించ నున్న ప్రపంచఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కుమరంభీం మనుమడు కుమరంసోనేరావు, ఆదివాసీ సంఘాల జేఏసీ రాష్ట్రఅధ్యక్షుడు కనకయాదవ్‌రావ్‌కోరారు. స్థానికమార్కెట్ కమిటీ యార్డులో గురువారం వారు మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవం కార్యక్రమానికి మూడుమండలాల ఆదివాసులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, వేలాదిగా తరలిరావాలని కోరారు. సమావేశంలో మహాగాం,మార్లావాయి,లేండిగూడ సార్మేడిలుఆనంద్‌రావ్, జుగునాకదేవరావ్, మేస్రాంబాదిరావ్, తుడుందెబ్బ జిల్లాఉపాధ్యక్షులు ఆత్రంశేషునారాయణ పాల్గొన్నారు.

మహిళను వేధించిన వ్యక్తిపై కేసు నమోదు

కాగజ్‌నగర్, ఆగస్టు 1: కాగజ్‌నగర్ బజ్‌రంగ్ చౌరస్తాలో ఓ మహిళను వేధించిన ఒకరిపై కేసు నమోదు చేసినట్టు సీఐ శంకరయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చిరువ్యాపారం చేసుకుంటున్న మహిళపట్ల బుధవారం రాత్రి అను చితంగా వ్యవహరించి, అసభ్యకరంగా ప్రవర్తించినట్టు మహిళ ఫిర్యాదుచేసిందన్నారు. ఈమేరకుస్థానికంగా నివాసం ఉంటున్న అన్నుపై కేసు నమోదు చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

డిగ్రీ కళాశాలలో వైద్యశిబిరం

ఆసిఫాబాద్, ఆగస్టు 1: పట్టణంలోని గిరిజన డిగ్రీకళాశాలలో గురువారం అడపీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహిం చారు. వైద్యులు వినోద్, సుమంగళి, రాకేష్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ ఉత్తం,ఎల్‌టీప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

బెజ్జూరు: వర్షాలకు గ్రామాల్లో జ్వరపీడితుల సంఖ్య పెరుగుతుండడంతో గురువారం సోమిని,మొగవెల్లిగ్రామాల్లో వైద్యశిబి రాలు ఏర్పాటు 13మంది జ్వరపీడితులను గుర్తించి రక్తపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది సంతోష్, ధర్మారావు, నాగరాజు, సావిత్రి, పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభంపై నుంచి పడి తీవ్రగాయాలు

బెజ్జూరు, ఆగస్టు 1: మండలంలోని సోమినిగ్రామంలో బుధవారం రాత్రి విద్యుత్‌వైరు తెగిపడి సరఫరా నిలిచిపోయింది. విద్యుత్‌శాఖలో అవుట్‌సోర్సింగ్‌గా పనిచేస్తున్న కుశ్నపల్లి గ్రామా నికి చెందిన రమేష్ విద్యుత్ స్తంభంపై ఎక్కి వైర్లుసరి చేస్తున్న క్రమంలో కిందపడ్డాడు. దీంతోఅతడికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్థులు రమేష్‌ను ఆటోలో బెజ్జూరు పీహెచ్‌సీకి అనంతరం డాక్టర్ సూచనమేరకు కరీంనగర్‌కు తరలించారు.

సీఎంకు కళాకారుల కృతజ్ఞతలు

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 1: రాష్ట్ర సాంస్కృతిక సారథి కళాకారులకు 30శాతం పీఆర్సీ అమలుచేయడంపై సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, సాంస్కృతిక, పర్యాటకశాఖమంత్రి జూపల్లి కృష్ణారావుకు కళాకారులు కృతజ్ఞతలు తెలిపారు. ఇన్నాళ్లకు కళాకారులకు గుర్తింపు లభించిందని గిరిజననాయకుడు మోహన్‌నాయక్ అన్నారు.

గ్రామాల్లో ఎన్నికల కోలాహలం

లింగాపూర్, ఆగస్టు 1: సీఎం ఇటీవల సర్పంచ్ ఎన్నికలపై ప్రకటన చేయడంతో గ్రామాల్లో ఎన్నికలపై చర్చ మొదలైంది. సర్పంచ్‌బరిలో నిలబడే ఆశావహులు ఇప్పటి నుంచే ప్రజల్లో, సామాజికకార్యక్రమాల్లో చురుకుగా ఎల్గొంటున్నారు.

సంక్షిప్తం..

వాంకిడి: వాంకిడితహసీల్దార్‌గా బాధ్యతలుచేపట్టిన రియాజ్‌అలీని గురువారం మాజీసర్పంచ్‌లు సన్మానించారు.

తిర్యాణి: మండలంలో ఉపరితలబొగ్గుగనుల్లో స్థానికఆదివాసీ నిరుద్యోగ యువతకు ఉపాధిఅవకాశాలు కల్పించాలని బెల్లంపల్లి జీఎంకు తుడుందెబ్బ, ఆదివాసీహక్కుల పోరాటసమితి నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు.

సిర్పూర్(యు): ప్రతిఒక్కరూ మొక్కలునాటి పర్యావరణాన్ని కాపాడాలని జైనూర్ సీఐ అంజయ్య అన్నారు.

జైనూర్: మండలకేంద్రంలో వారాంతపుసంతలో షీటీం అధికారులు మహిళలకు అవగాహన కల్పించారు.

-మండలకేంద్రంలో నాస్ అధ్వర్యంలో రెండురోజుల పాటుహెచ్‌ఎం మధుకర్, సీఆర్పీలసమక్షంలోనిర్వహించిన మండలకాంప్లెక్ససమావేశంగురువారం ముగిసింది.

-అన్నాబావు సాఠెను ఆదర్శంగా తీసుకొని ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని జిల్లాదళిత నాయకులు సుద్దాల శ్రీనివాస్ కోరారు.

కాగజ్‌నగర్/రెబ్బెన: ఎస్సీవర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుఇచ్చిన సందర్భంగా కాగజ్‌నగర్, రెబ్బెనలో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు జరిపారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్‌మార్కెట్‌లో గురువారం పిచ్చికుక్కలు స్వైరవిహారం చేసి 20 మందికిపైగా కరిచాయి.

చింతలమానేపల్లి: తల్లిపాలతోనేబిడ్డకు ఆరోగ్యమని ఐసీడీఎస్ సీడీపీవో విజయలక్ష్మిఅన్నారు. గురువారం చింతలమానేపల్లి-2సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.

దహెగాం: మండలంలోనిదహెగాం-1,ఇట్యాల-1అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు.

పెంచికలపేట: పెంచికలపేటఎఫ్‌ఆర్వోగా అనిల్‌కుమార్‌గురువారం బాధ్యతలు చేపట్టారు. భద్రాద్రిజిల్లా పాల్వంచలోవిధులు నిర్వర్తిస్తున్నఆయనబదిలీపై వచ్చారు.

-పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతఅని ఎస్సై కొమురయ్య అన్నారు. గురువారం పోలీసుస్టేషన్‌లో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు.

-మండలంలోని జిల్లెడలోగురువారంకుమరంభీం విగ్రహఏర్పాటుకు భూమిపూజ నిర్వహించారు.

-ఈనెల9నప్రపంచఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతంచేయాలని తుడుందెబ్బ రాష్ట్రఉపాధ్యక్షుడు చిన్నన్న కోరారు.

రెబ్బెన: రెబ్బెన తహసీల్దార్ రామ్మోహన్‌రావును గురువారం బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు.

చింతలమానేపల్లి: తహసీల్దార్‌గాబాధ్యతలు చేపట్టిన మునావర్‌షరీఫ్‌ను గురువారం కాంగ్రెస్‌నాయకులు సన్మానించారు.

-మండలకేంద్రానికి చెందిన బాల్దారపురాజన్న కొద్ది రోజుల క్రితం ఎడ్లబండిపై నుంచి కిందపడి గాయాలపాలయ్యాడు. గురువారం బాధితుడిని మాజీఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరామర్శించారు.


బెజ్జూరు: బెజ్జూరుఎఫ్‌ఆర్వోగా లక్ష్మీనారాయణ గురు వారంబాధ్యతలు స్వీకరించారు. ఇక్కడపనిచేసిన దయాకర్ నెన్నెలకు బదిలీపై వెళ్లారు.

-మండకేంద్రంలోని ఎస్వీ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం బీజేపీ మండలకార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీమండలాధ్యక్షుడు బాలకృష్ణఒకప్రకటనలో తెలిపారు.

కాగజ్‌నగర్: కన్యాకపరమేశ్వరిఆలయంలో గురువారం నూతనంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం కమిటీ ఏర్పాటైంది.

-సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌వాడటంతో క్యాన్సర్ లాంటి మహమ్మారిని దరిచేరకుండా చేయవచ్చని పునర్నవ సోషల్ ఫౌండేషన్ డైరెక్టర్ అశోక్ తెలిపారు.

-సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పట్టణసీఐ శంకరయ్య తెలిపారు. గురువారం బస్టాండులో ఏర్పాటు చేసిన అవగాహణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.



విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

జైపూర్, ఆగస్టు 1: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జడ్పీ సీఈవో గణపతి అన్నారు. మండలంలోని కుందారం, కిష్టాపూర్, వేలాల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను గురువారంసందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం కుందారంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకును సందర్శించి రైతు రుణమాఫీపై బ్యాంకు మేనేజర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను పరిశీలించి సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతి బాపు ఉన్నారు.

ముఖ్యమంత్రి, మంత్రుల చిత్ర పటాలకు క్షీరాభిషేకం

నస్పూర్, ఆగస్టు 1: తెలంగాణ సాంస్కృతిక సారథిలో పని చేస్తున్న కళాకారులకు పీఆర్సీని పెంచుతూ జీవో జారీ చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ గురువారం తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, సాంస్కృతిక శాఖ మంత్రుల చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు.. కార్యక్రమంలో కళాకారులు లావుడ్యా రమేశ్, ముల్కల్ల మురళి, మామిళ్ళ లచ్చన్న, వేల్పేరు పోశం, కొప్పర్తి రవీందర్, గొడిసెల కృష్ణ, వడకపురం రవి కుమార్, దయ సుధాకర్, శ్రీనివాస్, కృష్ణ, సమీరా, సంధ్యా, నిరోషా, రామటెంకి తిరుపతి, సంతోష్, రాజేశ్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

నస్పూర్, ఆగస్టు 1: పట్టణంలోని తాళ్ళపల్లి ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఏలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన డాన్ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలనీ వామ పక్ష విద్యార్థి సంఘాల అద్వర్యంలో గురువారం జిల్లా విద్యాధికారి యాదయ్యకు వినతి పత్రం అందించారు. డాన్ స్కూల్ యాజమాన్యం ఫిఫ్టింగ్ అనుమతులు పొందకుండా, బిల్డింగ్ పనులు పూర్తి కాకుండా విద్యార్థులను కింద కూర్చోబెట్టి పాఠశాలను కొనసాగిస్తోందని ఆరోపించారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కనుకుంట్ల సన్నీగౌడ్, యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, ఏఐఎస్ఎఫ్ నాయకుడు కుతూబ్ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

దండేపల్లి/జన్నారం, ఆగస్టు 1: దండేపల్లి మండలం మామిడిపల్లి వైపునకు బైక్‌పై అక్రమంగా తరలిస్తున్న కలపను బుధవారం రాత్రి దండేపల్లి కస్తూర్బా విద్యాలయం సమీపంలో కడెం కాలువ వద్ద పట్టుకున్నట్లు తాళ్లపేట అటవీ రేంజ్ అధికారిణి సుష్మారావు తెలిపారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం మంగి, గుండాల నుంచి బైక్‌పై అక్రమంగా కలపను అటవీ ప్రాంతం గుండా దండేపల్లి మండల వైపునకు తరలిస్తున్నరని సమాచారం మేరకు ఎఫ్‌బీవో సాయి తమ బేస్ క్యాంప్ సిబ్బంది దండేపల్లి కడెం కాలువ వద్ద మాటు వేసి పట్టుకున్నట్లు ఆమె చెప్పారు. దీని విలువ రూ. 33,844 విలువ ఉంటుందని, పట్టుకున్న కలపను కార్యాలయానికి తరలించారు. డిప్యూటీ రేంజ్ అధికారి పోచమల్లుకి తదుపరి విచారణ కోసం అప్పగించారు.

'వరదపై రాజకీయాలు చేయడం సిగ్గు చేటు'


మందమర్రిటౌన్, ఆగస్టు 1: కేరళలోని వాయినాడ్‌లో వరదలతో పెద్ద సంఖ్యలో మృత్యువాత పడితే సహాయ చర్యలకు సహకరించాల్సిన కేంద్రం దీన్ని రాజకీయం చేస్తుందని ఇది సరికాదని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు. గురువారం ఢిల్లీలో ఆయన మా ట్లాడిన అంశాలను స్థానిక ఎంపీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. తమ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వాయినాడ్ వరదలకు బాధ్యులని కేంద్రం విమర్శించడం సిగ్గుచేటన్నారు. గత పదేండ్లలో అనేక రైలు ప్రమాదాలు జరిగి అనేక మంది చనిపోయారన్నారు. బాధ్యతగా వ్యవహరించాల్సిన కేంద్రం ఇలా మాట్లాడడం సరికాదన్నారు. తమ నేతను విమర్శించిన బీజేపీ ఎంపీ అనురాగ్‌ఠాకూర్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

25 మంది బీఆర్ఎస్ నాయకులపై కేసు

చెన్నూరు, ఆగస్టు 1: పట్టణానికి చెందిన 25 మంది బీఆర్ఎస్ నాయకులపై గురువారం కేసు నమోదు చేసినట్లు సీఐ వాసుదేవరావు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం , శాంతి భద్రతలకు బంగం కలిగించినందుకు గాను కొత్తచట్టం బీఎన్ఎస్ఎస్ (170) సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే మరో 8 మంది బీజేపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

నిలిచిపోయిన యూపీఐ సేవలు

- నాలుగు రోజులుగా ఖాతాదారుల ఇబ్బందులు


తెలంగాణ గ్రామీణ బ్యాంక్
TELANGANA GRAMEENA BANK
ముఖ్య గమనిక
RBI ... UPI, IMPS, NEFT, RTGS, SFMS ... NPCI ... NPCI ...
- తెలంగాణ గ్రామీణ బ్యాంక్

గ్రామీణ బ్యాంకు జారీ చేసిన ప్రకటన

నెన్నెల, ఆగస్టు 1: ఏవ స్తువు తీసుకున్నా డబ్బులు చెల్లించేందుకు ఫోన్ తీసి స్కాన్ చేసే రోజులివి. అలాంటి ప్రస్తుత కాలంలో నాలుగు రోజులుగా యూ పీఐ సేవలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ, సహకార బ్యాం కుల ఖాతాదారులకు చెల్లిం పు సేవలు నాలుగు రోజులుగా నిలిచిపోవడంతో పల్లె ప్రజలు ఇక్కట్ల పాలవుతున్నారు. సాంకేతిక సమస్యతో జూలై 29 నుంచి యూపీఐ, ఐఎంపీఎస్, నెఫ్ట్, ఆర్‌టీజీఎస్, ఎస్ఎఫ్ఎంఎస్ తదితర డిజిటల్ సేవలన్నీ నిలిచిపోయాయి. దీంతో 90 శాతం గ్రామీణ, సహకార బ్యాంకుల్లోనే ఖాతాలు కలిగి ఉండే పల్లె జనంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ప్రతి ఒక్కరూ వాడే ఏటీఎం, ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా సైతం పేమెంట్స్ జరగడం లేదు. వ్యవసాయ పనులు జోరుగా కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో పెట్టుబడి డబ్బుల కోసం బ్యాంకుల చుట్టు తిరుగుతున్నారు. రుణమాఫీ నిధులు బ్యాంకుల్లో జమ అయినప్పటికీ వాటిని డ్రా చేసుకోలేక పోతున్నారు. ఓవైపు యూపీఐ సేవలు నిలిచిపోగా, మరోవైపు బ్యాంకుకు వెళితే రోజుకు రూ. 20 వేల కంటే ఎక్కువ నగదు ఇవ్వడం లేదని రైతులు తెలిపారు. చిన్న బ్యాంకులకు సాంకేతిక సేవలు అందజేస్తున్న సీ-ఎడ్జ్ టెక్నాలజీస్ సంస్థపై రామ్స్‌వేర్ (మాల్‌వేర్) దాడి వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని బ్యాంకింగ్ అధికారులు చెబుతున్నారు.

'ఎమ్మెల్యే అసమర్థత వల్లే నిధులు రాలేదు'

బెల్లంపల్లి, ఆగస్టు 1: బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి అసమర్థత వల్లే రాష్ట్ర బడ్జెట్‌లో నియోజక వర్గానికి నిధులు మంజూరు కాలేదని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏముర్లప్రదీప్ అన్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాలో గురువారం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలు,నిరుద్యోగులను మోసం చేసినట్లుగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేస్తుందన్నారు. నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షురాలు దార కళ్యాణి, బీజేపీ నాయ కులు రాంచందర్, సుమలత, విగ్నేష్, బాలకృష్ణ, శంకర్, శ్రావణ్, సాయితేజ, సాయిచరణ్, అంజి , వంశీ తదిత రులు పాల్గొన్నారు.

పరిహారం అందేనా?


కోటపల్లి మండలం వెంచపల్లిలో నీట మునిగిన పత్తి పంట (ఫైల్)


వేమనపల్లి మండలంలో ప్రాణహిత బ్యాక్ వాటర్‌తో నీట మునిగిన పత్తి పంట (ఫైల్)

- జిల్లాలో 7,500 ఎకరాల్లో నీట మునిగిన పంటలు
- నష్టం అంచనా ప్రభుత్వానికి అందజేత
- బుట్ట దాఖలవుతున్న నివేదికలు
- నాలుగేళ్లుగా ఇదే తంతు
- కాంగ్రెస్ ప్రభుత్వంపైనే రైతన్నల ఆశలు

మంచిర్యాల, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): వరుసగా కురిసిన వర్షాలు, ప్రాణహిత బ్యాక్ వాటర్ కారణంగా నీట మునిగిన పంటకు నష్టపరి హారం అందుతుందా అనే సందేహాలు సర్వత్రా నెలకొన్నాయి. నాలు గేళ్లుగా బ్యాక్ వాటర్ కారణంగా వేలాది ఎకరాల్లో పంటలు నీటిపా లవుతున్నా ప్రభుత్వాలు పరిహారం మాటే ఎత్తకపోవడం సందేహాలకు ఆజ్యం పోస్తోంది. యేటా పంటలు మునిగినప్పుడల్లా నష్టం అంచనా వేయడం, సంబంధిత నివేదికలను ప్రభుత్వానికి అందజేయడం షరా మామూలైపోయింది. అధికారులు అందజేసిన నివేదికలను ప్రభుత్వం బుట్ట దాఖలు చేయడంతో పరిహారం అందుతుందేమోనని ఆశగా ఎదురు చూసే రైతుల ఆశలు అడియాశలుగా మిగులుతున్నాయి.

ప్రాణహిత బ్యాక్ వాటర్‌తో..

ఇటీవల ప్రాణహిత నది బ్యాక్ వాటర్ కారణంగా వేమనపల్లి, కోట పల్లి మండలాల్లోని 7,500 ఎకరాల్లో పత్తి పంట పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. పంట సాగు చేసేందుకు ఎకరాకు రూ. 15 వేల నుంచి 20 వేల వరకు వెచ్చించినట్లు బాధిత రైతులు వాపోతున్నారు. లక్షలు వెచ్చించి సాగు చేసిన పంట ఆదిలోనే అంతం కావడంతో ఆరు గాలం శ్రమించిన అన్నదాతలు జీర్ణించుకోలేక పోతున్నారు. మరోవైపు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుల సముదాయం పూర్తయిన నాటి నుంచి జిల్లాలో పెద్ద మొత్తంలో పంట నష్టం వాటిళ్లుతూ వస్తోంది. అన్నారం, మేడిగడ్డ ప్రాజెక్టుల బ్యాక్ వాట ర్ కారణంగా కోటపల్లి మండలంలో 2019లో 1,484 మంది రైతులకు సంబంధించిన సమారు 1,670 ఎకరాలు పూర్తిగా నీట మునగగా, 2020లో 1,644 మంది రైతులకు చెందిన 4,580 ఎకరాల్లో పంట తుడిచిపెట్టుకుపోయింది. 2021లో 601 మందికి చెందిన 1,063 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లింది. చెన్నూరు మండలంలో 2019లో 839 మంది రైతులకు చెందిన 1,183 ఎకరాలు, 2020లో 81 మందికి చెందిన సుమారు 100 ఎకరాలు, 20201 లో 1,081 మందికి చెందిన 2100 ఎకరాల్లో పంట నీళ్లపాలయింది. గత రెండేళ్లగా కురిసిన భారీ వర్షాల కారణంగానూ ప్రాజెక్టుల బ్యాక్ వాటర్ లో వేలాది ఎకరాల పంట నీట మునిగింది. ఈ ఏడాది ఇటీవల కురిసిన వర్షాలకు కోటపల్లి మండలంలోని 20 గ్రామాల్లో 1,985 మంది రైతులకు చెందిన 3725 ఎకరాలు నీట మునగగా, భీమిని మండలంలోని ఏడు గ్రామాల్లో 61 మంది రైతులకు చెందిన 112 ఎకరాలు కూడా నీట మునిగింది. అలాగే వేమనపల్లి మండలంలోని 15 గ్రామాల్లో 2,155 మంది రైతులకు చెందిన 3,660 ఎకరాలు పూర్తిగా నీటిపాలైనట్లు వ్యవసాయశాఖ అధికారులు నివేదిక తయారు చేశారు. పంట నీట మునిగినప్పుడల్లా అధికారులు సర్వే జరిపి, పంట నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివే దిక అందజేస్తున్నారు. 2019 నుంచి ఇదే తంతు జరుగుతుండగా ప్రభుత్వపరంగా రైతులను ఆదుకున్న దాఖలాలు లేవు. కాంగ్రెస్ ప్రభుత్వ మైనా ఆదుకుంటుందోనని బాధిత రైతులు గంపెడాశతో ఉన్నారు.

నీటిపాలైన పత్తి పంట..

ఇటీవల వారం రోజులపాటు జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు గోదావరి, ప్రాణహిత నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. జిల్లాలోని వేమనపల్లి మీదుగా కోటపల్లి మండలం వరకు ప్రవహిస్తున్న ప్రాణహిత నది యేటా వర్షాకాలంలో ఉప్పొంగుతండడంతో పెద్ద మొత్తంలో పంటలు నీట మునిగి రైతులకు అపార నష్టం వాటిళ్లుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద గోదావరి నీటిని స్టోర్ చేస్తుండటంతో బ్యాక్ వాటర్ ప్రాణహిత ద్వారా సమీపంలోని పంట పొలాల్లో చేరుతోంది. ఈ కారణంగా కోటపల్లి మండలం వెంచపల్లి, జనగామ, సూపాక, సిర్సా, పుల్లగాం, అన్నారం, వేమనపల్లి మండలంలోని ముల్కలపేట, గొర్లపల్లి, రాచర్ల గ్రామాల్లోని వేలాది ఎకరాల పత్తి చేలలో వారం రోజులపాటు నీరు నిలిచి ఉండటంతో పంట పూర్తిగా వాడిపోయింది. పత్తితోపాటు వరి, మిర్చి పంటలు సైతం నీట మునగడంతో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. ప్రతియేటా ఇదే తంతు జరుగుతుండటంతో రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఐదెకరాల పంట మునిగింది..

నలిమెల గోపాల్, కోటపల్లి మండలం జనగామ



ఐదెకరాల్లో వేసిన పత్తి పంట నీటిలో మునిగింది. ఎకరానికి రూ. 15వేల పైగా ఖర్చుచేసి ఆరుగాలం శ్రమించి పంట సాగు చేస్తున్నాను. ఊహించని విధంగా ప్రాణహిత ఉప్పొంగి పూర్తిగా ఐదెకరాల పంట నీట మునిగింది. వారం రోజులపాటు నీటిలోనే ఉండడంతో పంట మొత్తం మురిగిపోయింది. ప్రభుత్వం నష్టపరిహారం అందజేయాలి.

మొలక దశలోనే కుళ్లిపోయింది..: కొత్తరి సత్తయ్య, వేమనపల్లి



వేమనపల్లి శివారులో ఆరు ఎకరాలో వేసిన పత్తి పంట మొలక దశలోనే కుళ్లిపోయింది. యేటా ప్రాణహిత నది నీటితో వేలు ఖర్చుచేసి సాగు చేసిన పంట పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. అధికారులు పంట నష్టం అంచనా వేసి పంపుతామని చెబుతున్నారు. కానీ పరిహారం అందడం లేదు. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

ప్రభుత్వ కార్యాలయాలను తనిఖీ చేసిన కలెక్టర్


పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

వేమనపల్లి, ఆగస్టు 1: మండల కేంద్రంలో పలు ప్రభుత్వ కార్యాలయాలను కలెక్టర్ కుమార్ దీపక్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయాల్లోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన కలెక్టర్‌కు గ్రామస్థులు పలు సమస్యలను విన్నవించారు. మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉన్నప్పటికీ వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పట్టణ ప్రాంతాల్లో ఉంటూ సమయ పాలన పాటించడం లేదని చెప్పారు. దీంతో తమ గ్రామంలో సర్కారు వైద్య సేవలు అందకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతకుముందు కలెక్టర్ తహసీల్దార్ కార్యాలయాన్ని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో సిబ్బందిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం రైతు వేదికను, గ్రంథాలయాలను పరిశీలించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. నిర్లక్ష్యం చేసే వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ వెంట ఏపీవో సత్యప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం

- మహిళా ఎమ్మెల్యేలకు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నాయకుల డిమాండ్

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 1: బీఆర్ఎస్ పార్టీ మహిళా ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. పట్టణంలోని ఐబీ చౌరస్తాలో ధర్నా నిర్వహించిన అనంతరం దిష్టిబొమ్మను దహనం చేయాలని నిర్ణయించుకున్న నాయకులు ఆ మేరకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసుకున్నారు. వారి ప్రయత్నాన్ని భగ్నం చేసేందుకు పోలీసులు ఐబీ చౌరస్తాలో భారీగా మోహరించారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు రూట్ మార్చి ఓవర్‌బ్రిడ్జి వద్దకు చేరుకొని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటీన ఐబీ ప్రాంతం నుంచి ఓవర్‌బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు. అక్కడే దిష్టిబొమ్మను దహనం చేస్తే పోలీసులు అడ్డుకుంటారని గ్రహించిన బీఆర్ఎస్ నేతలు కొంతమంది ఐబీ ఆవరణలో ఆర్డీవో కార్యాలయానికి వెళ్లే మార్గం వద్ద దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో లక్సెట్టిపేట మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, మంచిర్యాల మాజీ చైర్మన్ పెంట రాజయ్య తదితరు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు నూనేటి సత్యనారాయణ, బడికెల శ్రావణ్ పాల్గొన్నారు.

చెన్నూరు: పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెల దామోదర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మోతె తిరుపతి, మాజీ సర్పంచు సాధన బోయిన కృష్ణ, పట్టణ కౌన్సిలర్ రేవెల్లి మహేష్, నాయకులు పాల్గొన్నారు. కాగా నిరసన కార్యక్రమాలను అడ్డుకునేందుకు పోలీసులు మున్సిపల్‌వైస్ చైర్మన్ నవాజుద్దీన్, కౌన్సిలర్లు వేల్పుల సుధాకర్, దోమకొండ అనిల్, జగన్నాధుల శ్రీను, నాయకులు డాక్టర్ రాజారమేష్, రాంలాల్‌గిల్డా, షఫీ అదుపులోకి తీసుకుని పోలిస్‌స్టేషన్‌కు తరలివంచారు.

కోటపల్లి: ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలకు నిరసన చేపట్టేందుకు సిద్ధమవుతున్న బీఆర్ఎస్ మండల నాయకులను గురువారం పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మందమర్రిటౌన్: మందమర్రిలో బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో రాజారమేష్, మేడిపల్లి సంపత్, వెంకటేష్, ఈశ్వర్, కనకయ్య, తోట సురేందర్, ముస్తాఫా, ఓదెలు, నర్సింహులు పాల్గొన్నారు.


28వ డిస్ట్రిబ్యూటరీ కాలువ నుంచి వృథాగా పోతున్న సాగు నీరు

వృథాగా సాగునీరు

- పట్టించుకోని అధికారులు

దండేపల్లి, ఆగస్టు1: కడెం ప్రాజెక్టు ద్వారా ఆయకట్టు రైతుల పంటలకు అందించే సాగునీరు డిస్ట్రిబ్యూటరీ కాలువలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో వృథాగా పోతున్నది. మండల కేంద్రంలో ఆంధ్రాకాలని సమీపంలో 28వ డిస్ట్రిబ్యూటరీ కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో పాటు పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దీంతో కాలవపైనుంచి నీరు రోడ్డుపైకి పారుతోంది. ఉన్నతాధికారులు స్పందించి చివరి భూములకు సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సంక్షిప్తం..

- బెల్లంపల్లి: క్రికెట్‌లో గ్రామీణప్రాంత యువత రాణించాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా ఆధ్వర్యంలో గురువారం స్థానిక నంబరు 2 క్రీడా మైదానం లో జిల్లాస్థాయి అండర్ 19, 23 విభాగాల్లో నిర్వహించిన ఎంపిక పోటీలను ఏసీపీ ప్రారంభించారు.
- దండేపల్లి: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవనంను నిర్మించాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులతో కలిసి యూఎస్ఎఫ్ఐ సంఘ నాయకులు తహసీల్దార్ సంధ్యరాణికి వినతిపత్రం అందజేశారు.

- గుడిరేవు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎస్సై ఉదయ్‌కిరణ్ మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే అనార్థాలపై అవగహన కల్పించారు.

- మందమర్రి టౌన్: పట్టణంలో గురువారం తవక్కల్ పాఠశాల విద్యార్థులు బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయానికి ప్రతీక అని తెలిపారు.

- పట్టణంలోని మార్కెట్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని సీపీఎం మండల అద్యక్షుడు దూలం శ్రీను డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు

- లక్సెట్టిపేటరూరల్: లక్సెట్టిపేటలోని శ్రీచైతన్య టెక్నో ప్రైవేటు పాఠశాలలో బోనాల పండగను గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కో ఆర్డినేటర్ జయ తదితరులు పాల్గొన్నారు.
- మందమర్రిరూరల్: సారంగపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లోని నర్సరీలను గురువారం ఎంపీడీవో రాజేశ్వర్ పరిశీలించి సూచనలు చేశారు.

- మండలంలోని సారంగపల్లి గ్రామంలో గురువారం వరినారు కొనలను తుంచే పద్ధతిపై ఏఈవో ముత్యం తిరుపతి రైతులకు అవగాహన కల్పించారు.

- చెన్నూరు: పట్టణంలో బీజేవైఎం నాయకులు నిరసన చేపట్టారు. అసెంబ్లీ సమావేశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గానికి 4,600 కోట్ల నిధులు కేటాయించి ఇతర నియోజకవర్గాలకు నిధులు కేటాయిం చక పోవడాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టారు
- మంచిర్యాల కలెక్టరేట్: మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను గురువారం కలెక్టరేట్ కార్యాల యంలో నూతనంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన హరీష్‌రాజ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.
- నస్పూర్: తెలంగాణ కళా వేదిక మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలుగా నస్పూర్ పట్టణానికి చెందిన బత్తుల శారదను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు నకిరేకంటి కిరణ్ కుమార్ గురువారం ఆదేశాలు జారీ చేశారు.
- జన్నారం: సర్పంచుల సంఘం, జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీల పెండింగ్ బిల్లులు చెల్లించాలని శుక్రవారం రాష్ట్ర సచివాలయం ఎదుట నిరసన చేపడుతున్నామని తెలిపారు.
- రామకృష్ణాపూర్: క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని జ్యోతినగర్, తిలక్‌నగర్, కనకదుర్గ కాలనీ ఏరియాల్లో వార్డు కౌన్సిలర్ పుల్లూరి సుధాకర్ ఆధ్వర్యంలో గురువారం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు.

వర్గీకరణతో ఎస్సీ ఉప కులాలకు న్యాయం

- మంద కృష్ణ పోరాటం అభినందనీయం
- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య మాదిగ


మంచిర్యాలలో నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 1: వర్గీకరణతో ఎస్సీ ఉప కులాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు కోర్టు అనుకూలంగా తీర్పునిచ్చిన నేపథ్యంలో గురువారం జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మందకృష్ణ మాదిగ చిత్రప టానికి క్షీరాభిషేకం చేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వీట్లు పంచి పెట్టారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య మాదిగ మాట్లాడుతూ 30 ఏళ్ల సుదీర్ఘ ఉద్యమంలో అనేక అవమానాలు, అనేక కుట్రలు చేస్తూ జాతిని విచ్ఛిన్నం చేయడానికి ఎంత మంది ప్రయత్నం చేసినా మందకృష్ణ మాదిగ ఎప్పుడు కూడా ఉద్యమాన్ని పక్కన పెట్టకుండా వర్గీకరణ కోసం పోరాటాలు చేశారన్నారు. ఆయన పోరాట ఫలితంగా వర్గీకరణ నెరవేరిందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, దశరథం, మల్లేష్, తిరుపతి, సత్యం, పోసన్న, శ్రీనివాస్,ప్రవీణ్, శంకర్, సారంగం, రాజలింగు, చంద్రశేఖర్, రాజ్‌కుమార్, విష్ణు, కిరణ్, ఉదయ్, రావ్ పాల్గొన్నారు. కాగా జిల్లా కేంద్రంలో మాదిగ యూత్ నాయకులు స్వీట్లు పంచారు. కార్యక్రమంలో నరేష్, విజయ్, సాగర్, రోహిత్, శ్రీనివాస్, విక్రమ్ పాల్గొన్నారు.

నస్పూర్: ఎస్సీ వర్గీకరణ పై సుప్రీం కోర్టు తీర్పునివ్వడం మరువ రాని విజయమని మాదిగ హక్కుల దండోరా (ఎంఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునిల్ మాదిగ అన్నారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలుతో కలిసి సునిల్ మాదిగ సీసీసీలో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కొండ్ర లింగయ్య, కొప్పర్తి రాజం, అందె చంద్రయ్య, కడారి రమేష్, నాతరి కిరణ్, సమ్మయ్య, కొండ ఉదయ్, సంజయ్, బాలయ్య, సాజన్, బాబన్న, రజనీబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

హాజీపూర్: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు రావడంతో గురువారం రాత్రి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మందకృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

కాసిపేట: వర్గీకరణతో ఎస్సీ ఉపకులాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జీ కల్వల శరత్ మాదిగ అన్నారు. కాసిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు దాసరి శంకర్, లంక లక్ష్మణ్, రాయమల్లు, కళ్యాణ్, అజయ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు: ఎస్సీ వర్గీకరణకు కోర్టు అనుకూలంగా తీర్పునిచ్చిన సందర్భంగా పట్టణంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు తగరం మధురాజ్ తదితరులు పాల్గొన్నారు.

భీమారం: ఎస్సీ వర్గీకరణకు కోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మొండయ్య, సత్యనారాయణ, సతీష్, చంద్రయ్య, రాజబాపు, రవి, రాజుకుమార్, నాగభూషణం, కృష్ణ పాల్గొన్నారు.

జన్నారం: మండల కేంద్రంలో గురువారం ఎంఆర్‌పీఎస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహం వద్ద టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మామిడిపల్లి ఇందయ్య, రమేష్,ప్రవీణ్, జంగం రవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.